

నేడు గ్రూప్ 4 పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిపిఎస్‌సి ద్వారా రెవిన్యూ డిపార్ట్ లో నిర్వహించనున్న జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ మెయిన్ పరీక్ష మంగళవారం నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ గణపతి రావు తెలిపారు. జిల్లాలో రాజాం జిఎంఆర్ , అయాన్ డిజిటల్ జోన్, గాజులరేగ సీతం కాలేజీలో 3 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్ష రెండు పూటలా ఉదయం 9.30 నుండి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. 3 కేంద్రాల్లో కలిపి 1780 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. సోమవారం డిఆర్‌ఒ తన ఛాంబర్ లో పరీక్ష నిర్వహణకు అవసరమగు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఆయాశాఖల అధికారులకు ఆదేశించారు. సమావేశం లో సంబంధిత శాఖల అధికారులు, ఎపిపిఎస్‌సి ప్రతినిధులు పాల్గొన్నారు.

పంటలకూ డయాగ్నోస్టిక్ సెంటర్లు



- మండలానికొకటి చొప్పన ఏర్పాటుకు సన్నాహాలు
- ఎమ్మెస్సీ, బిఎస్‌సి అగ్రికల్చర్ అర్హతగల ఉద్యోగుల నియామకం
- ఏప్రిల్, మేలో మూడు దఫాలుగా శిక్షణ
- బయోస్కోప్ తదితర పరిశోధనా పరికరాలతో ప్రత్యేక లేబొరేటరీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఫ్యామిలీ డాక్టర్ తరహాలోనే ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన పంటల పరిరక్షణకు కూడా ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మండలానికో పిహెచ్‌డిసి (ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్) ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే దీనికి సంబంధించిన కసరత్తు ముమ్మరం చేసింది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఏటా కొత్తకొత్త తెగుళ్ల వస్తున్నాయి. వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయాల్లో అగ్రి కల్చర్ అసిస్టెంట్లు ఉన్నప్పటికీ సలహాలు, సూచనలు ఇవ్వడానికే పరిమితమవుతున్నారు. ప్రత్యేక సందర్భాల్లో వ్యవసాయ పరిశోధనా సంస్థల నుంచి శాస్త్రవేత్తలు వచ్చి, పరిశీలన చేసి, రిపోర్టులు అందజేసేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. దీంతో, రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో కనీసం మండలానికో డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పంటల వారీగా వస్తున్న తెగుళ్లను ఎక్కడికక్కడ పరిశోధనలు చేసి, రైతులను సకాలంలో అప్రమత్తం చేయడం ద్వారా ఇబ్బందులు లేకుండా చేయొచ్చనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశంగా తెలుస్తోంది. ఆయా మండల పరిధిలోని భూసార పరీక్షలు కూడా వీటిలోనే నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగావున్న 685 మండలాల్లో ఏదో ఒక ఆర్‌బికెకు అనుసంధానంగా ఈ డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. మండలంలో కొత్తగా నిర్మించిన లేదా ప్రత్యేక సదుపాయాలు కలిగిన ఆర్‌బికెను ఎంపిక చేస్తారు. అక్కడ ఎమ్మెస్సీ లేదా బిఎస్సీ అగ్రికల్చర్ విద్యార్హత ఉంటే సరేసరి. లేదంటే అదే మండలం లేదా ఇతర మండలాల్లో సచివాలయాల్లో పనిచేస్తున్న వారిని బదిలీపై ఈ కేంద్రాలకు తరలిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైనంత మంది సచివాలయ వ్యవస్థలోనే ఉన్నారన్నది ప్రభుత్వ లెక్క. అప్పటికీ వీరి సంఖ్య సరిపోకపోతే వ్యవసాయ శాఖలోని అర్హులను నియమిస్తారు. ఇప్పటికే దాదాపు అన్ని జిల్లాల్లోనూ అర్హత గల ఉద్యోగులను ఎంపిక చేశారు. వీరికి ఏప్రిల్‌లో రెండు దఫాలు, మే నెలలో ఒక దఫాగా మొత్తం 18రోజులపాటు జిల్లాల వారీగా స్థానిక డిఆర్‌సి (డిస్ట్రిక్ట్ రీసోర్స్ సెంటర్) ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. శిక్షణ పూర్తిచేసిన అనంతరం డయాగ్నోస్టిక్ సెంటర్లలో బయోస్కోప్ తదితర వ్యవసాయ పరిశోధనా పరికరాలను, వ్యవసాయ పరిశోధనా గ్రంథాలను కూడా అందుబాటులో ఉంచనున్నారు. వరి, మొక్కజొన్న, పత్తి ఇలా ప్రతి పంటకూ శాస్త్రవేత్తలు ఈ డయాగ్నోస్టిక్ సెంటర్లకు మెంటార్‌గా వ్యవహరిస్తారు. అవసరమైన సందర్భాల్లో ఆయా సెంటర్లను సందర్శించి పరిశోధనలకు సహకరించి, రైతులకు తగిన సూచనలు ఇవ్వనున్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

188 మంది గైర్హాజరు • పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 127 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 24255 మంది విద్యార్థులకు గాను 24067 మంది హాజరయ్యారు. 188 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలి రోజు పరీక్ష కావడంతో పరీక్ష కేంద్రాలకు ఉదయం 8గంటలకే విద్యార్థులు, వారి తల్లి తండ్రులతో చేరుకున్నారు. విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ ఉత్సాహ పరిచారు. విద్యార్థు తల్లి తండ్రులతో పాటు ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు కూడా పరీక్ష కేంద్రాలకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. 9 గంటలకు పరీక్ష కేంద్రం లోపలికి పోలీసులు, పరీక్ష సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి అనుమతించారు. సెల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్ల కుండా తనిఖీలు చేపట్టారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు లు నిర్వహించారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ఎటువంటి ఇబ్బందులూ లేకుండా జరిగిందని డిఇఒ లింగేశ్వర రెడ్డి తెలిపారు. 62 కేంద్రాలను స్క్వాడ్‌లు తనికీ చేశాయని తెలిపారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

గంట్యాడ : గంట్యాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తనిఖీ చేసి పరీక్షలు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు.



గంట్యాడ : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ఎస్ఐ ఔదార్యం

నెల్లిమర్ల: పదో తరగతి పరీక్షా కేంద్రం తెలియక ఇబ్బంది పడిన విద్యార్థినిని సమయానికి ఎస్ఐ పి. నారాయణ రావు ఆ పరీక్షా కేంద్రానికి చేర్చారు. విద్యార్థిని నెల్లిమర్ల జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రానికి హాజరు కావాల్సి ఉండగా రెల్లి వీధి బాలికల ఉన్నత పాఠశాలకు హాజరైంది. ఆ సమయంలో ఎస్ఐ నారాయణరావు అక్కడే ఉండడంతో వెంటనే చొరవతో ఆ బాలికను గురుకుల పాఠశాలకు తీసుకు వెళ్లి పరీక్ష కేంద్రానికి చేర్చారు. దీంతో ఆ విద్యార్థిని ఊపిరి పీల్చుకుంది.



ఎస్.కోట : విద్యార్థులను తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్



నెల్లిమర్ల : విద్యార్థినిని పరీక్షా కేంద్రానికి తీసుకెళ్తున్న ఎస్ఐ నారాయణరావు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఫేకర్ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు

విద్యుత్‌ఛార్జీల పెంపును విరమించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్ ఛార్జీలు పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని ఫేకర్ కార్మికసంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు, కార్మికులు కలెక్టర్‌కు వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో 1956లో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమల ప్రస్తుతం 300 మంది శాశ్వత కార్మికులు, మరో 400 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని, ఈ సంస్థ పై ఆధార పడి ఎన్నో చిన్న వర్క్ షాపులు, వ్యాపార సంస్థలు కూడా నడుస్తున్నాయని తెలిపారు. దేశ, విదేశీ మార్కెట్‌లో పోటీని తట్టుకుంటూ, ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి నడుస్తున్నదని తెలిపారు. యూనియన్లన్నీ సమిష్టిగా పనిచేస్తూ సంస్థను నిలబెట్టుకుంటున్న ఈ క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థ డిస్కం ఎపిఇఆర్‌సి ఆమోదంతో విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచారని తెలిపారు. ఈ భారాన్ని ఫేకర్ సంస్థ మోయ లేదన్నారు. ఇదే పరిస్థితి జిల్లాలో నడుస్తున్న మరో 15 పరిశ్రమల్లో కూడా ఉందన్నారు. అన్ని పరిశ్రమల్లో కలిపి సుమారు పదివేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నా యన్నారు. విద్యుత్ ఆధారిత ఫెర్రో పరిశ్రమకు 40 శాతం ఉత్పత్తి ఖర్చు విద్యుత్ చార్జీల చెల్లింపునకే అవుతుంది. వెంటనే ప్రభుత్వం స్పందించి పెంచిన ఛార్జీలను ఉపసంహరించా లని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు జంపాన విశ్వనాధరాజు, అంబల్ల గౌరి నాయుడు, ఉత్తరాపల్లి ప్రకాశ్, రమేష్, విసినిగిరి రామునాయుడు, ముకేష్ కుమార్ సింగ్, బమ్మిడి అప్పలస్వామి, కంది రామారావు, టిఆర్ కూర్మారావు, వి.సన్యాసిరావు, వి.రామారావు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటే లక్ష్యం

డ్రగ్స్ నుంచి బాలలను దూరం చేయండి : జాతీయ బాలల కమిషన్ సభ్యులు ఆనంద్

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి

బాలల కోసం ప్రతి జిల్లాలో అబ్జర్వేషన్ హోం (పునరావాస కేంద్రం) ఏర్పాటు చేయడమే లక్ష్యమని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కమిషన్ సభ్యులు ఆర్‌జి ఆనంద్ చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అబ్జర్వేషన్ హోంలు లేని చోట వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్టు వెల్లడించారు. స్థానిక జిల్లాపరిషత్ అతిథిగృహంలో రాష్ట్ర బాలహక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుతో కలసి విలేకరుల సమావేశంలో ఆనంద్ మాట్లాడారు. జిల్లాలో బాలలపై నేరాలు లేనప్పటికీ బాలల పునరావాస గహం ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొన్నారు. జిల్లాను డ్రగ్స్ రహితంగా, బాల్య వివాహాలను లేని జిల్లాగా రూపొందించాలన్నారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్వాగతం పలికారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారిని కలిసి జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై చర్చించారు. తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించి, జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనపై దృష్టి పెట్టామని చెప్పారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. జిల్లాలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహాన్ని ఇస్తున్నామని కలెక్టర్ అన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని వివరించారు. అనంతరం దిశ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి మహిళలపై అకృత్యాలను నిరోధించేందుకు చేపడుతున్న చర్యలను డిఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు ద్వారా తెలుసుకున్నారు. కొత్త ధర్మపురిలో వున్న ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సందర్శించి బాలుర పరివర్తన, వారి పునరావాసానికి చేపడుతున్న చర్యలు, అబ్జర్వేషన్ హోం ఏర్పాటుకు గల అవకాశాలపై పరిశీలన చేశారు. ఆయన వెంట డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, బాలల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షురాలు హిమబిందు, జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, సిపిఒ పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జాతీయ బాలల కమిషన్ సభ్యులు ఆనంద్

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం

గర్భిణీలు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. సోమవారం ఐసిడిఎస్ ఆధ్వర్యాన విటి అగ్రహారం కళ్యాణమండపంలో పోషన్ పక్వడా లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాల్యవివాహాలు జరగకుండా తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పోర్ట్ ఫైడ్ రైస్ ను లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చంద్ర శ్రీనివాస్, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ జి.హిమబిందు, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నగరంలో మాంసం విక్రయాలు బంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహావీర్ జయంతి సందర్భంగా మంగళవారం నగరంలో ఎక్కడా మాంసం విక్రయాలు చేపట్టవద్దని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. మాంస విక్రియదారులు పై సమాచారాన్ని గమనించి ఏ ఒక్కరూ చికెన్, మటన్ వంటి మాంస విక్రయాలు చేపట్టకూడదని తెలిపారు. నిబంధనలకు అతిక్రమించి మాంస విక్రయాలు జరిగినట్లు గమనిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పునరావాసం కల్పించాలని బాధితుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని బొగ్గుల దిబ్బ దళితులు సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 10న విజయనగరం మున్సిపల్ అధికారులు అకారణంగా దళితుల ఇళ్లు కూల్చేశారని, 2 నెలలైనా పునరావాసం కల్పించలేదని అన్నారు. ఇళ్లు లేని 15 మంది పేదలకు లంకాపట్నంలో ఇళ్లు ఇచ్చి పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ చెప్పారని అన్నారు. కానీ నేటికీ పునరావాసం కల్పించలేదని, టిడ్కో ఇళ్లు వచ్చిన 19మందికి నేటికీ అవి అప్పగించలేదని అన్నారు. గుంకలాం లేఅవుట్ లో ఇళ్లు మంజూరు చేసిన వారికి కట్టుకునే ఆర్థిక పరిస్థితి లేదని, కావున తక్షణమే ఇళ్లు కోల్పోయిన వారికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గుల దిబ్బ దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, అర్,ఆనంద్, అప్పల పైడమ్మ రాజు తది తరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బొగ్గుల దిబ్బ దళితులు, సిపిఎం నాయకులు

మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టాలి

- టోల్ ఫ్రీ నెంబరు 14500కు సమాచారం ఇవ్వాలి
- తీరప్రాంత రక్షణ పట్ల అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మాదక ద్రవ్యాల వాడకాన్ని జిల్లాలో పూర్తిగా అరికట్టాలని, వీటి రవాణాపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. మాదక ద్రవ్యాలను అరికట్టడం ఒక సామాజిక బాధ్యతగా ప్రతీఒక్కరూ పరిగణించాలని సూచించారు. నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం, తీరప్రాంత రక్షణపై వివిధ శాఖల అధికారులతో, మెరైన్ పోలీసు సిబ్బందితో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సమీక్షా సమావేశాలు నిర్వహించారు. వీటిపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకాన్ని, రవాణాను అరికట్టడానికి ఒక పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. వీటి వినియోగంవల్ల కలిగే అనర్థాలపై విస్తత అవగాహన కల్పించాలని ఆదేశించారు. దీనికోసం అన్ని ఉన్నత పాఠశాలలు, కళాశాలల వద్దా హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు, రవాణాను అరికట్టేందుకు 14500 తదితర టోల్ ఫ్రీ నెంబర్లను విద్యాసంస్థలతోపాటు, సచివాలయాల్లో కూడా ప్రదర్శించాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు దశలవారీగా సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ పాఠశాలలను ఆనుకొని ఉన్న బడ్డీ షాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిఇఒను ఆదేశించారు. ముఖ్యంగా వసతి గృహాలపై దష్టిపెట్టి, విద్యార్థుల అలవాట్లను గమనించాలని సూచించారు. మద్యానికి బానిస అయినవారికి, ఆ అలవాటును మాన్పించడానికి పరివర్తన శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని డి-అడిక్షన్ సెంటర్ లో అన్ని వసతులూ కల్పించి, ఈ సెంటర్ గురించి ప్రచారం చేయాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ, మద్యం, మత్తు పదార్థాలు కూడా గృహ హింసకు ఒక కారణమని పేర్కొన్నారు. వీటిపై మహిళా పోలీసులచేత సర్వే నిర్వహించి, అవసరమైన వారిని డి-అడిక్షన్ సెంటర్‌కు పంపించి, చికిత్స చేయించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

తీరప్రాంత రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండండి

తీరప్రాంత రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. తీరప్రాంత రక్షణా చర్యలుపై మెరైన్ పోలీసు అధికారులతో సమీక్షించారు. చింతపల్లిలోని మెరైన్ పోలీస్ స్టేషన్‌కు వెంటనే ప్రహరీ గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తీరంలో వాచ్ టవర్స్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని పంచాయితీరాజ్ అధికారులను ఆదేశించారు. సముద్రంలో చంపావతి నది కలిసే చోట కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదన తయారు చేయాలన్నారు. సముద్ర తీరంలో ప్రమాద సమయంలో సందర్శకులను రక్షించేందుకు గజ ఈతగాళ్ల నియామకాన్ని పరిశీలిస్తామన్నారు. జెట్టీ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశాల్లో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సీతం'లో ఛత్రపతి శివాజీ వర్ధంతి

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఛత్రపతి శివాజీ 344 వ వర్ధంతిని నిర్వహించారు. శివాజీ స్వతంత్ర స్ఫూర్తి అజరామరమని, ఆయన ధ్యేయాలను విద్యార్థులంతా అలవరుచుకోవాలని గ్రంథాలయాధికారి డాక్టర్ ఎల్.సత్యవతి పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి. శశిభూషణ్ రావు మాట్లాడుతూ శివాజీ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, ఎన్‌సిసి అధికారి ఎం.వరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సతీష్‌కుమార్, విద్యార్థులు స్నేహ, అన్న నేహ థామస్,యశోద, హారిక, హిమజ, నవీన్, నిఖిల్, సాయికుమార్ పాల్గొన్నారు.

నేడు పెంటశ్రీరాంపురంలో 'ఇదేం కర్మ'

గంట్యాడ : పెంట శ్రీరాంపురంలో మంగళవారం ఉదయం 11గంటలకు టిడిపి ఆధ్వర్యాన 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ గ్రామ టిడిపి నాయకులు కరక నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి కళా వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు, గజపతినగరం నియోజకవర్గంలోని, మాజీ జడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు శ్రీ వేముల చైతన్య బాబు, ప్రస్తుత మండల పార్టీ అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నివాళి

బొబ్బిలి : జై భారత్ సత్యాగ్రహం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పారాదిలో మహాత్మ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిసిసి సభ్యులు ముద్వల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై బిజెపి ప్రభుత్వం మానసిక దాడులు చేయడం సిగ్గు చేటన్నారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడులను ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

స్పందనకు199 వినతులు

సచివాలయ సిబ్బందికి మరో విడత శిక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 199 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 140 ఉన్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్య లపై మిగిలిన వినతులు అందాయి. కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జె.సి మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతిరావు, ప్రత్యేక ఉపకలెక్టర్లు పద్మలత, సూర్యనారాయణ, పాల్గొని వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో పరిష్కారం కావాల్సిన అనేక వినతులు జిల్లా స్థాయికి వస్తున్నాయని, సచివాలయ సిబ్బందికి మరోసారి శిక్షణ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. నియోజక వర్గం స్థాయిలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించాలన్నారు.



స్పందనలో సమస్యలు వింటున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

కుక్కలకు వెంటనే వ్యాక్సినేషన్ వేయాలి

విజయనగరం కోట : నగర పరిధిలో కుక్కలకు వెంటనే వ్యాక్సినేషన్ వేయాలని టిడిపి నాయకులు స్పందనలో కలెక్టర్‌కు వినతి అందజేశారు. విజయనగరం పరిధిలో కుక్కలు రోజురోజుకూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయని అన్నారు. చిన్నారులను కరిచేస్తున్నాయని, గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లే సమయంలో కూడా వారి పై దాడి చేస్తున్నాయని తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కనకల మురళీమోహన్, కర్రోతు నర్సింగరావు, రొంగలి రామారావు, విజ్జపు ప్రసాద్,గంటా పోలినాయుడు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులపై తక్షణ చర్యలు : డిఎస్‌పి

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. 40 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. వారం రోజుల్లో చర్యలు తీసుకొని ఎస్‌పి కార్యాలయానికి నివేదించాలని తెలిపారు.

మందిరాల కంటే మరుగుదొడ్లు అవసరం



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఎంపిపి

మెంటాడ : మందిరాలు కంటే మరుగుదొడ్ల నిర్మాణం ఎంతో అవసరమని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. చింతలవలస గ్రామంలో ఆప్కో, ఎల్ఐసి సంస్థలు సంయుక్తంగా సుమారు రూ.5లక్షలతో ఆరు సామాజిక మరుగుదొడ్లు, బోరు, రన్నింగ్ వాటర్ నిర్మించారు. సర్పంచ్ కలిసెట్టి సూర్యనారాయణ ప్రహరీ గోడను నిర్మించారు. ఈ మరుగదొడ్లను ఎంపిపి సన్యాసి నాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ మరుగుదొడ్లు ఏర్పాటైతే మండలాభివృద్ధికి పెద్ద సూచికగా నిలుస్తుందన్నారు. ఆరుబయట మలవిసర్జన జరగకుండా గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఆప్కో సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ మండలంలో ఐదు గ్రామాలను దత్తత తీసుకున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా చింతల వలస గ్రామంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. దత్తత గ్రామాల్లో తాగునీరు, ఇరిగేషన్, డ్రైనేజ్ నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు పిన్నింటి నారాయణ, కలిశెట్టి సత్యం యువత, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

బూత్ కన్వీనర్లకు శిక్షణ

డెంకాడ : మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయిలో టిడిపి కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇంఛార్జిలు, సెక్షన్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్ పై బూత్ కన్వీనర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్ రావు, డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, కడగల ఆనంద్‌కుమార్, కర్రోతు సత్యనారాయణ, నాయకులు ఆకిరి ప్రసాద్ రావు, కలిదిండి పాణీరాజు, బైరెడ్డి లీలావతి, గేదెల రాజారావు, రాజప్పన్న, చీకటి సుహాసిని, విక్రమ్ జగన్నాధం, క్లస్టర్ ఇంఛార్జిలు, యూనిట్ ఇంఛార్జిలు, బూత్ ఇంఛార్జిలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

గజపతినగరం : గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ఆమె ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర చాలా ప్రాముఖ్యమైందన్నారు. వారికి గత 10 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం చాలా దారుణమన్నారు. పంచాయతీలకు సంబంధం లేకుండా జీతాలను రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీఒ ప్రకారం 10 వేల రూపాయల జీతం అందించాలన్నారు. అనంతరం గ్రీన్స్‌లో ఎంపిడిఒకు వినతి పత్రమిచ్చారు.

క్రాష్ ప్రోగ్రాం ప్రారంభం

గుర్ల : గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు అన్నారు. వైస్ ఎంపిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, కె.వి. సూర్యనారాయణ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో మండలానికి సంబంధించిన క్రాష్ ప్రోగ్రామ్ వాహనాన్ని ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించి తాగు నీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కళ్యాణి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు ఘన నివాళి

బొబ్బిలి : మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు జి.సుబ్బారావుకు మున్సిపల్ కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ మస్తర్ కార్యాలయం వద్ద సోమవారం సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.గౌరీష్, జె.శంకరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి సుబ్బారావు ఎంతో కృషి చేశారన్నారు. సుబ్బారావు ఆశయ సాధనకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండోలో ప్రతిభ

బొబ్బిలి: రాజస్థాన్ రాష్ట్రంలోని కోటాలో గతనెల 28 నుంచి 31 వరకు జరిగిన జాతీయ స్థాయి టైక్వాండో పోటీలలో బొబ్బిలి క్రీడాకారిణి బి. యశస్విని ప్రతిభ కనబరిచింది. ప్రతిభ కనబరిచిన యశస్వినిను టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన కోటలో సోమవారం అభినందించారు. సబ్ జూనియర్ అండర్ 20 కిలోల వెయిట్ కేటగిరీలో యశస్విని పాల్గొని కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. టైక్వాండో పోటీలలో జాతీయ స్థాయిలో బొబ్బిలికు పతకం తీసుకురావడం సంతోషంగా ఉందని బేబినాయన అన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బొబ్బిలి : పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. టిఆర్ కాలనీలో సోమవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండగలమని, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిహెచ్ అనసూయమ్మ, అంగన్వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు పిల్లలకు అవసరం

కొత్తవలస : అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు చిరుధాన్యాల ఎంతైనా అవసరమని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. పోషకాహార పక్షోత్సవం ముగింపు కార్యక్రమం సందర్భంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్వాడి పిల్లలు శారీరిక మానసిక ఎదుగుదలకు చిరుధాన్యాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఆర్. ఉమాదేవి, సహాయక సిడిపిఒ బి. లక్ష్మిభాయ్, అంగన్వాడి సూపర్‌వైజర్లు కె.వి. స్వర్ణలత, కె.రమణమ్మ, రామకృష్ణమ్మ, జి. కావేరి, పి.భాగ్యలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తొలగింపు

వేపాడ : మండలంలోని బొద్దాం గ్రామంలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు అనే కథనం ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం వెలువడిన కథనానికి స్పందించిన గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న జేఎల్‌ఎం వైర్లను సరిచేసి ప్రమాదము జరగకుండా తగు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేవ చేయడం గొప్ప విషయం

డెంకాడ : పేదలకు సేవ చేయడం గొప్ప విషయమని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అన్నారు. ప్రధానమంత్రి టిబి ముక్తభారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి పేషెంట్లకు హెచ్‌ఎస్ ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నెలకి సరిపడే మందులు, పౌష్టికాహారాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదవారికి వివిధ రూపాల్లో సేవ చేయడం అలవర్చుకోవాలన్నారు. హెచ్‌ఎస్ ఫౌండేషన్ మండలంలో అన్ని గ్రామాల్లో ఇప్పటికే వివిధ రూపాల్లో సేవ చేస్తున్నారని ఇంకా శ్రద్ధ వహించి ఎక్కువ సేవ చేయాలని కోరారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాటర్ ఫిల్టర్‌ను వితరణగా హెచ్ ఎస్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ ఎం పావనికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, టీచర్ రోజా రమణి, జిల్లా టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ సత్యనారాయణ, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

రేగిడి : గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ జి. శ్రీ చరణ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టు నుంచి వచ్చిన తాగునీరు సాంకేతిక పరమైన సమస్యలు వస్తే సమాచారం అందించాలన్నారు. తాగునీటి బోర్లు, మంచినీటి పథకాలు మొరాయిస్తే తక్షణమే నివేదికలు అందించాలన్నారు.

కోలాటం శిక్షణా తరగతులు ప్రారంభం

బొబ్బిలి : యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నుండి కోలాటం కళారూపం పైన శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయని అధ్యక్షుడు ఎం. విజయ మోహన్‌రావు తెలిపారు. స్థానిక రఘు జూనియర్ కళాశాలలో అన్ని వయసుల వారికి ఉచితంగా నెలరోజుల పాటు కోలాటం కళారూపం పై అనుభవజ్ఞులైన సీనియర్ కళాకారుల చేత శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు.

తొలిరోజు పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

తొలిరోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సోమవారం 8కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభ మయ్యాయని ఎంఇఒ అంబళ్ళ కృష్ణారావు తెలిపారు. నగర పంచాయతీలో బిసి గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పి బాలికోన్నత పాఠశాల, పారసాం, రామ తీర్థం, అలుగోలు, మొయిద జడ్పి ఉన్నత పాఠశాలలు, సతి వాడ మోడల్ స్కూల్ కేంద్రాలుగా 1428మందికి గాను 9మంది గైర్హాజరై 1419మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

పూసపాటిరేగ : మండలంలోని ఆరు కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు 1,119 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఏడుగురు విద్యార్థులు హాజరు కాలేదని ఇంఛార్జి ఎంఇఒ రమణమూర్తి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా 144 సెక్షన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెల్లివలస ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని తహశీల్దార్ ఈమంది భాస్కరరావు సోమవారం పరిశీలించారు.

డెంకాడ : పదో తరగతి పరీక్షలకు సోమవారం మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 554 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

గుర్ల : మండలంలో గుర్ల, కలవచర్ల, తెట్టంగి పరీక్ష కేంద్రాల లో పదో తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఇఒ భాను ప్రకాష్ తెలిపారు. 493 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరిక్ష కేంద్రాలను తహశీల్దార్, ఎస్ఐలు పరిశీలించారు.

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 206 మంది, విక్టరీ ప్రైవేట్ పాఠశాలలో 106 మంది, ఎస్‌డబ్ల్యుటి పాఠశాలలో 75 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్షకు హాజరయ్యారు. ఒక్కరూ కూడా గైర్హాజరు కాకుండా అందరూ పరీక్షకు హాజరైనట్లు ఎంఇఒ జి. శ్రీదేవి తెలిపారు.



వేపాడ: పరీక్ష రాసేందుకు బస్సుతో సహ బయలుదేరిన విద్యార్థినులు

వంగర: మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు ఇద్దరు మాత్రమే గైర్హాజరయ్యారని ఎంఇఒ యాగాటి దుర్గారావు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలను డిప్యూటీ డిఇఒ తిరుపతి నాయుడు, తహశీల్దార్ డి ఐజాక్ వేర్వేరుగా పరిశీలించారు. ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రామభద్రపురం: మండలంలో 2 కేంద్రాల్లో 535 మంది విద్యార్థులు పరీక్షలు రాయ డానికి నిర్ణీత సమయం కన్నా ముందే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష గదుల్లోకి ప్రవేశానికి ముందే స్థానిక పోలీస్ సిబ్బంది ఎస్ఐ సురేంద్ర నాయుడు పర్య వేక్షనలో క్షుణ్ణంగా పరిశీలించి మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకు పోకుండా తనిఖీలు చేపట్టారు. ఇక్కడ 535 మందికి గాను ఇద్దరు గైర్హాజరయ్యారు.

జామి : తొలి రోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తహశీల్దార్ హేమంత్ కుమార్ పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించి, సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జెరాక్స్ షాపులను మూయించారు. మండలంలో జామి, కుమారాం, అలమండ హైస్కూల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల విద్యాధికారి జయశ్రీ పర్యవేక్షణలో తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

బొబ్బిలి: బొబ్బిలిలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 30నిమిషాలు ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. బొబ్బిలిలో తొమ్మిది పరీక్షా కేంద్రాలలో 1942మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1933మంది పరీక్షలు రాసినట్లు అధికారులు చెప్పారు. పరీక్షా కేంద్రాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. తెర్లాం మండలంలో మూడు కేంద్రాలలో 585మందికి 584మంది, బాడంగి మండలంలో మూడు కేంద్రాలలో 580మందికి 589మంది పరీక్షలు రాసారు.

రేగిడి: మండలంలోని సంకిలి, లక్ష్మీపురం, అంబాడ వెంకటాపురం, రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నాలుగు పరీక్షా కేంద్రాల్లో శతశాతం విదార్థులు తొలి పరీక్షకు హాజరైనట్లు అధికారులు ఎం. రామినాయుడు, షణ్ముఖరావు, కృష్ణారావు,



వంగర: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ ఐజాక్

రాజ్యలక్ష్మి గురుమూర్తి, మురళి కృష్ణ, వాసుదేవరావు తెలిపారు.

శృంగవరపుకోట: సోమవారం నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి పి సత్యనారాయణ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీరు వైద్య సేవలు అందుబాటులో ఉంచామని అన్నారు. 741 మందికి గాను 740 మంది హాజరయ్యారని చెప్పారు. ఎస్‌ఎస్‌ఏ కెజిబివి రాష్ట్ర కార్యదర్శి ఎన్ గీత మండలంలో గల నాలుగు పరీక్ష కేంద్రాలలో పరిశీలించి విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన సౌకర్యాలను పరిశీలించారని ఆయన తెలిపారు.

మెరక ముడిదాం: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో తొలి రోజు సోమవారం 600 మంది పరీక్ష రాసినట్లు ఎంఇఒ పి. రామారావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీటి సదుపాయం, వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల బందోబస్తులో మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

మెంటాడ: మండలంలోని పదోతరగతి తొలి రోజు పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. మెంటాడ, చల్లపేట,పెదమేడపల్లి మోడల్ స్కూల్లో 487 మంది పరీక్ష రాయనుండగా ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఇఒ వెంకటరావు తెలిపారు. ఆయా సెంటర్లు వద్ద ఎస్ఐ సిద్దార్ధ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును నిర్వహించారు. విద్యార్ధులకు సత్యసాయి సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. పరీక్షలు ఏవిధంగా జరుగుతున్నాయో గజపతినగరం సిఐ లెంక అప్పలనాయుడు పరిశీలించారు.

సమగ్ర శిక్ష సిబ్బంది నిరసన

ప్రజాశక్తి- మెంటాడ

సమగ్ర శిక్షా , కెజిబివి లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద, మండల కేంద్రాల్లోని ఎంఇఒ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. విజయనగరంలో జరిగిన నిరసనలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు మాట్లాడుతూ సమగ్ర శిక్షా , కెజిబివి లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖలలో, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైంస్కేలు అమలు చేసి, వేతనాలు పెంచి 15 నెలలు గడుస్తున్నా సమగ్ర శిక్షా ఉద్యోగుల వేతనాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం చొరవ చూపడం లేదన్నారు. ఔట్సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోని మార్చాలని, ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చెయ్యాలని, కరవు భత్యం, ఇంటి అద్దె సౌకర్యం,



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గ్రాట్యుటీ కల్పించాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీం అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 5 స్పెషల్ లీవ్‌లు మంజరు చేయాలని, 11వ పిఆర్‌సి ప్రకారం లీవ్ లను అమలు చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అర్. చంద్రరావు, పార్ట్ టైం టీచర్స్ జిల్లా నాయకులు ఎం. వెంకటరమణ, ఉద్యోగులు శివ గంగ, సత్యనారాయణ, సత్యవతి పాల్గొన్నారు.

గురువులకు సత్కారం మంచి సాంప్రదాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గురువులను సత్కరించడం మంచి సాంప్రదాయమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. ఆదివారం రాత్రి జరజాపు పేటకు చెందిన ఉషోదయ యూత్ అసోసియేషన్ 35వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక నల్లి అప్పల సూర్యనారాయణ కళా వేదిక పై జరిగిన సభలో ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు హాజరై రిటైర్డ్ ప్రభుత్వ ప్రిన్సిపాల్ బోని బంగారు నాయుడు సత్యవతి దంపతులను ఉషోదయ యూత్ అసోసియేషన్ తరపున సత్కరించి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బంగారు నాయుడుని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఆయన సేవలు గుర్తించి ఉషోదయ యూత్ అసోసియేషన్ సత్కరించడం అభినందనీయమని అన్నారు. యూత్ అసోసియేషన్ బిల్డింగ్ రూ.2లక్షలతో మరమ్మతులు చేపడతానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ జరజాపు పేటను తన స్వగ్రామంగా



దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

భావించి అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. సత్కార గ్రహీత బంగారు నాయుడు మాస్టర్ మాట్లడుతూ మండలంతో బాటు జిల్లాలో ఎన్నో సేవలందించిన స్వర్గీయ పెనుమత్స సాంబ శివరాజు విగ్రహం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, వైసిపి నాయకులు మద్దిల వాసు, పోలుబోతు నారాయణ మూర్తి, కౌన్సిలర్లు అవనాపు సత్య నారాయణ, కింతాడ కళావతి, పాంగ్రంకి సత్యవతి, ఉషోదయ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు బోలె ఆదినారాయణ, మద్దిల ప్రసాద్, బోలె రమణా రావు తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫౌండేషన్ సేవలు ఆదర్శం

ప్రజాశక్తి- డెంకాడ

విజయనగరం యూత్ ఫౌండేషన్ సేవలు ఇతరలకు ఆదర్శమని సిబిఐ పూర్వ జెడి వివి లక్ష్మీనారాయణ కొనియాడారు. లెండి ఇంజనీరింగ్ కళాశాలలో జెడి ఫౌండేషన్, లెండి ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎన్‌జిఒల పాత్ర కీలకమన్నారు. విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామాష్‌ను శాలువా, షీల్డ్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బిశెట్టి బాబ్జి, రాయల్ క్యాబ్స్ శరత్, వాసు, కళాశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

రక్త దాతలకు సత్కారం

నెల్లిమర్ల: జరజాపు పేటకు చెందిన సాధన యువజన సంఘం కార్యదర్శి, రక్తదాత పసుమర్తి వెంకట రమణకు లెండి ఇంజనీరింగ్ కళాశాలలో సత్కారం జరిగింది. సిబిఐ మాజీ జేడి లక్ష్మీ నారాయణ జన్మదినం సందర్భంగా 31సార్లు రక్త దానం చేసిన సాధన యువ వెంకట రమణను జెడి సత్కరించారు.



రక్తదాతలను సత్కరిస్తున్న సిబిఐ పూర్వ జెడి లక్ష్మీనారాయణ

శారదకు ఉత్తమ రక్తదాత అవార్డు

బొబ్బిలి: అభ్యుదయ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ చింతా శారదకు ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకు ఉత్తమ రక్తదాత అవార్డును నాగేశ్వరరావు, బీశెట్టి బాబ్జి ప్రదానం చేశారు. జాయింట్ ఫర్ డవలప్మెంట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జెడి లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా లెండి ఇంజినీరింగ్ కళాశాలలో చింతా శారదను సన్మానించి అవార్డు అందజేశారు. రక్తదానం చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించి అనేక సామాజిక కార్యక్రమాలను చింతా శారద చేశారు. సేవలకు గుర్తింపుగా అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని శారద అన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' పై సమావేశం

ప్రజాశక్తి- బొబ్బిలి

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పై, వార్డు సచివాలయ కన్వీనర్లతో సోమవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణ మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ తెలియజేయవలసిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారుదులపై ఉందన్నారు. ఏప్రిల్ 7నుంచి 14వ తేదీ వరకు నియోజకవర్గంలో అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఇంటి ఇంటికి జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాల్ రావు, జెసిఎస్ కన్వీనర్ రేజేటి విశ్వేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు, ఇంఛార్జిలు, వైసిపి కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు,

బొబ్బిలిరూరల్ : పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎంపిపి సంబంగి లక్ష్మీ, వైసిపి మండల అధ్యక్షులు సంబంగి వేణుగోపాల్ నాయుడులు అన్నారు. సోమవారం కారాడ, పిరిడి, అలజంగి, కమ్మవలస, శివడ వలస సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్ళేటప్పుడు సుమారు 15 నుంచి 20 నిమిషాల సమయం కేటాయించి మా నమ్మకం నువ్వే జగన్ అనే డోర్ స్టిక్కర్లను వారి అనుమతితో ఇంటికి అతికించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, మండల జేసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్‌రావు పాల్గొన్నారు.

వంగర: అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో మండలంలోని శివ్వాం, వంగర మండల కేంద్రంలో గృహ సారథులు వాలంటీర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహసారథులు వాలంటీర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, సర్పంచ్ బొక్కేల లక్ష్మీనారాయణమ్మ, వైసిపి నాయకులు బొక్కేల వెంకట అప్పలనాయుడు, వెంకట నాయుడు పాల్గొన్నారు.


కరకవలసకు రోడ్డు వేయాలి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

కరకవలస కాలనీకీ వెళ్లేందుకు రహదారి నిర్మించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆ కాలనీ మహిళలు నిరసన జరిపారు అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ మాట్లాడుతూ 500 ఇళు ఉన్నా నేటికీ ఆ కాలనీకి రహదారి లేదన్నారు. వీధి రోడ్లు వేయలేదని, అంగన్ వాడి కేంద్రం లేదని, ఏ సచివాలయ పరిధిలోకి వెళ్తుందో తెలియదని అన్నారు రేషన్‌బండి వెళ్లకపోవడంతో దూరంగా వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పటి కైనా కనీసం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరకవలస మహిళలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొని డ్రైవర్ మృతి

రామభద్రపురం: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపాన ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ కొన్న సంఘటనలో డ్రైవర్ క్యాబిన్‌లోనే మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. నల్గొండ జిల్లాకు చెందిన గుగ్గుపోతు రాములు అలియాస్ రాము నాయక్ (53) సాలూరు సిమెంట్ లోడ్‌తో వెళుతూ ఆగి ఉన్న లారీని సోమవారం తెల్లవారు జామున ఢీ కొట్టాడు. వాహన ముందుభాగం నుజ్జు నుజ్జు అయ్యి, క్యాబిన్‌లోనే తుది శ్వాస విడిచాడు. లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న మృత దేహాన్ని జెసిబి సాయంతో పోలీస్‌లు బయటకు తీశారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేసి మృత దేహాన్ని సిహెచ్‌సికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



డ్రైవర్ మృత దేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

నేరాలు ఘోరాలు

దాడి చేసిన వారిపై కేసు నమోదు

శృంగవరపుకోట : మండలంలోని చామలపల్లి గ్రామంలో పూరిపాకను తొలగించాలంటూ దాడి చేసిన ఘటనలో ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చామలపల్లి గ్రామంలో సుమారు 45 ఏళ్ల క్రితం పురుపాక నిర్మించుకొని నివాసముంటున్న యశోద, రమణ, శ్రీను తదితరులపై దాడి చేయడమ కాకుండా వారు నిర్మించుకున్న పాకను కూల్చడమే కాకుండా అడ్డుకున్న ముగ్గురిపై దాడి చేశారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జుత్తాడ పెద్ద సూర్యారావు, బుజ్జి అమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలు

శృంగవరపుకోట: ఎస్ కోట నుంచి మోటారు బైక్ పై బొడ్డవర వైపు వెళుతున్న తండ్రి కొడుకులు పట్టణంలోని జలగలబంద వద్ద సిమెంట్ పైపులను ఢీకొన్న ఘటనలో గాయపడ్డారని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మూలబొడ్డవరకు చెందిన తండ్రి చిన్నయ్య కొడుకు రవి ఎస్.కోటలో తమ పనులు చూసుకొని బొడ్డవర బయలుదేరి వెళుతున్నారు. పట్టణంలోని జలగల బంద్ దగ్గరకు వచ్చేసరికి పక్కన ఉన్న సిమెంటు పైపులను బలంగా ఢీకొనడంతో తండ్రి చిన్నయ్య తలకు బలంగా గాయమైంది. క్షతగాత్రులను పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించాం. అతనికి బలమైన గాయం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మెంటాడలో దొంగతనం

- 7 తులాల బంగారం, రూ.30వేలు నగదు చోరీ
- తెలిసిన వారిపనేనని పోలీసుల అనుమానం

ప్రజాశక్తి- మెంటాడ

స్థానిక ఎస్‌సి కాలనీలో నగర సన్యాసమ్మ ఇంట్లో సోమవావరం చోరీ జరిగింది. బీరువాలో వుంచిన 12 తులాల బంగారు ఆభరణాల్లో 7 తులాలు బంగారు ఆభరణాలు, రూ.30వేలు చోరికి గురయ్యాయి. మిగిలిన ఐదు తులాల బంగారు ఆభరణాలను విడిచిపెట్టేయడంతో తెలిసిన వారే ఈ దొంగతనం చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆంద్ర ఎస్ఐ సిద్దార్థ్ కుమార్ అందించిన వివరాలు ప్రకారం.. మెంటాడ ఎస్‌సి కాలనీకి చెందిన నగర సన్యాసమ్మ కుమార్తె సాయి బొండపల్లి గ్రామానికి చెందిన మక్కువ సత్యం అప్పల నాయుడును నాలుగేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకుంది. అప్పటి నుంచి సాయి, సత్యం అప్పలనాయుడు గజపతి నగరంలో నివాసముంటున్నారు. సాయి రెండో ప్రసవం నిమిత్తం మూడు నెలలు క్రితం కన్నవారి ఇంటికి మెంటాడ వచ్చారు. అప్పటి నుంచి మెంటాడలో అంతా కలిసి వుంటున్నారు. మార్చి 30న గురువారం గజపతినగరంలో నూడిల్స్ వ్యాపారం ప్రారంభోత్సవం సంధ్భంగా అందరూ ఇంటికి తాళం వేసుకొని గజపతినగరం వెళ్ళిపోయారు. మరలా ఆదివారం మెంటాడ ఇంటికి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తాళాలు పగులగొట్టి బట్టలు చిందరవందరగా పడివున్నాయి. బీరువాలో వుంచిన నగలు లేకపోవడంతో ఆంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సోమవారం క్లూస్ టీమ్ వేలుముద్రలు సేకరించిందరి ఎస్ఐ తెలిపారు.



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్, పోలీసులు

తెలిసినవారి పనేనని అనుమానం

ఇంటి తలుపులకు తాళాలు వేసి ఉండటం, ఇంటి కిటికీకు తలుపులు లేకపోవడంతో దొంగలు కిటికీ నుంచి ఇంట్లోకి చొరబడి వుంటారని పోలీసులు భావిస్తున్నారు. బీరువాలో వుంచిన 12 తులాల బంగారు ఆభరణాల్లో 7 తులాల విలువైన నాలుగు గాజులు, రెండు చైన్‌లు, నాలుగు జతల చెవి రింగులు మాత్రమే చోరి చేశారు. మిగిలిన 5 తులాల్లో మూడు తులాల హారం, రెండు తులాల నక్లెస్ భద్రంగానే వున్నాయి. దీంతో చోరీకి తెలిసిన వాళ్ళు పాల్పడి వుంటారని భావిస్తున్నారు. చోరీ సొత్తు పై కుటుంబ సభ్యులలో గందరగోళం, తడబాటు కనిపిస్తుందని ఎస్.ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గజపతినగరం సి.ఐ అప్పలనాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.